సాక్షి
వికారాబాద్

ఆదివారం । 27 । జూలై । 2025



టీచర్ల కొరత!

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. దీంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదు. 9లో▸



లక్నాపూర్ ప్రాజెక్ట్ నీటిలో పర్యాటకుల సందడి



పొంగిపొర్లుతున్న శివసాగర్ అలుగు

❖ జలకళ

జిల్లాలో వారం రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. యాలాల మండలంలోని శివసాగర్ ప్రాజెక్టు అలుగు పారుతోంది. మండలంలోని అన్ని కుంటలు, చెరువులు పూర్తిగా నిండాయి. గోవిందరావుపేట, సంగెంకుర్దు సమీపంలో కాగ్నా నదిపై నిర్మించిన చెక్‌డ్యాంలు ఉప్పొంగుతున్నాయి. జుంటుపల్లి ప్రాజెక్టులోకి సైతం భారీగా వరదనీరు చేరుతోంది. పరిగి మండలంలోని లక్నాపూర్ ప్రాజెక్ట్ అలుగు పారుతోంది. దీంతో సందర్శకుల తాకిడి పెరిగింది. శనివారం ఈ ప్రాజెక్టును ఎస్పీ నారాయణరెడ్డి సందర్శించారు. సందర్శకులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు నర్సింహులు ఉన్నారు.

యాలాల /పరిగి

న్యూస్‌రీల్

ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

తాండూరు టౌన్: తమను వెంటనే పర్మినెంట్ చేయాలని తాండూరు మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ సంస్థ అయిన తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయ ముట్టడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఏళ్ల తరబడిగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. రెగ్యులర్ అయ్యే వరకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సేవలు సక్రమంగా అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ సైబర్ వారియర్‌గా మహేశ్ కుమార్

టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ ప్రశంస



ప్రశంసా పత్రం అందుకుంటున్న మహేశ్ కుమార్

తాండూరు టౌన్: సైబర్ సెక్యూరిటీ నేర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తాండూరు పట్టణ పోలీసు కానిస్టేబుల్ మహేశ్ కుమార్ ఉత్తమ సైబర్ వారియర్‌గా ప్రశంసా పత్రం అందుకున్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో సైబర్ వారియర్లు, సైబర్ సెక్యూరిటీ విభాగంలో పనిచేసే అధికారులకు శనివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ టీజీసీఎస్‌బీ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు జిల్లాల నుంచి సైబర్ క్రైం విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 25 మంది సైబర్ వారియర్లతో పాటు, సైబర్ క్రైం పోలీసు స్టేషన్ల నుంచి 15 మంది అధికారులను ఎంపిక చేశారు. వీరిలో మహేశ్ కుమార్‌కు చోటు లభించింది. ఆయనకు డైరెక్టర్ శిఖా గోయల్ నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, పట్టణ సీఐ సంతోష్ కుమార్ మహేష్‌ను అభినందించారు.

కేజీబీవీలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

యాలాల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో స్పాట్ అడిషన్లు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఓ మంగమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఈసీ తెలుగు మీడియంలో 16 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల బాలికలు పదో తరగతి మెమో, టీసీ, బోనాఫైడ్, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో కేజీబీవీలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 7660 986 838, 9505 081 830, 7702 959 689లలో సంప్రదించాలని కోరారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

పరిగి డీఎస్పీ శ్రీనివాస్



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలం కర్ణాటక సరిహద్దున ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ బంగారం రాజ్‌కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు వర్షార్పణం



అధ్వానంగా మారిన వికారాబాద్ - సదాశివాపేట రహదారి

వాహనదారులకు నరకయాతన

- గత ఏడాది మరమ్మతులకే దిక్కులేదు
- నిధులు మంజూరైనా టెండర్ల వద్దే ఆగిన పనులు
- నిద్రావస్థలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలు

భారీ వర్షాలకు దెబ్బతిన్న మెజార్టీ రహదారులు

వికారాబాద్: జిల్లాలో వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. గతంలోనే చాలా రహదారులు పాడయ్యాయి. ప్రస్తుత వర్షాలకు మరింత అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నా పనులు జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. గుంతల్లో మట్టి కూడా పోయడం లేదు. గంట ప్రయాణానికి రెండు గంటల సమయం పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పెద్దపెద్ద గుంతల కారణంగా ఒళ్లు హూనమైపోతోందన్నారు. గతేడాది వరుసబెట్టి కురిసిన వర్షాలతో లాభాల కంటే నష్టాలే ఎక్కువ. జిల్లా వ్యాప్తంగా అనేక రోడ్లు ధ్వంసమయ్యాయి. ఇంతజరిగినా కనీస మరమ్మతులు చేపట్టలేదు. అప్పట్లో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదురైనా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు స్పందించిన పాపానపోలేదు. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రతిపాదనలతో సరి

గతేడాది కురిసిన వర్షాలకు పాడైన రోడ్ల మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లా వ్యాప్తంగా 198 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. వీటిని పూర్తిస్థాయిలో బాగు చేసేందుకు రూ.89 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించారు. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.8 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. అప్పట్లో ఆర్‌అండ్‌బీ శాఖ 98 కిలోమీటర్ల రోడ్లను బాగు చేసేందుకు రూ.39 కోట్లు మంజూరు చేసింది. పంచాయతీ రాజ్ శాఖ రూ.20 కోట్లు విడుదల చేసింది. అయితే టెండర్ల ప్రక్రియ వద్దే పనులు ఆగిపోయాయి.

దెబ్బతిన్న రోడ్లు ఇవే..

జిల్లాలో ఒకటి రెండు మినహా మెజార్టీ రోడ్లనీ పూర్తిగా దెబ్బతిన్నాయి. వికారాబాద్ - పరిగి, వికారాబాద్ - నవాబుపేట, వికారాబాద్ - బుగ్గదేవాలయం వెళ్లే దారి, వికారాబాద్ - తాండూరు, కొడంగల్ - తాండూరు, కొడంగల్ - మహబూబ్‌నగర్, పరిగి - మిట్టకోడూర్, దోమ మండలంలోని దోర్నాల్‌పల్లి - గొడుగోనిపల్లి, ఐనాపూర్ - పాలెపల్లి, గడిసింగాపూర్ - మల్లేపల్లి, వికారాబాద్ - సదాశివాపేట్, కోటాలగూడ - లాల్‌సింగ్ తండా, మన్నెగూడ - మిర్జాపూర్ మీదుగా లల్‌సింగ్ తండా రోడ్డు, వికారాబాద్ - దామగుండ తదితర రోడ్లు అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని జిల్లా ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

- జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం

కొంగల్ రూరల్: ఫెర్టిలైజర్ దుకాణ యజమానులు ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం సూచించారు. శనివారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి, అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవన్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. స్టాక్‌లో వ్యత్యాసం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. మండల వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సాగుపై ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో డివిజన్ సిబ్బంది, ఏడీఏ, వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ శంకర్ రాథోడ్, మండల వ్యవసాయాధికారి తులసి, ఏఈఓలు పాల్గొన్నారు.

క్షణికావేశంలో తప్పులు చేయొద్దు

- పరిగి సబ్ జైలులో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం
- ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

పరిగి: క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకు రావడం వల్ల కుటుంబం మొత్తం క్షోభిస్తుందని జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పరిగి సబ్ జైలులో శనివారం ఖైదీల న్యాయ సహాయ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బెయిల్ దొరకని ఖైదీలు న్యాయ సహాయ క్లినిక్ సేవలు పొందాలన్నారు. ఇక్కడ డిఫెన్స్ కౌన్సిల్, న్యాయవాదులు అందుబాటులో ఉంటారని, ఉచితంగా న్యాయ సహాయం అందిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని ఖైదీలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్షణికావేశంలో చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కుటుంబ బాధ్యత తీసుకోవాలని సూచించారు. మంచి అలవాట్లను అలవర్చుకుని అందరితో స్నేహ భావంతో మెలగాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీస్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, కొడంగల్ జడ్జి శ్రీరాం, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు వెంకటేశ్, రాము, శ్రీనివాస్, గౌస్‌పాషా, పాషం, రవి తదితరులు పాల్గొన్నారు.

29న తాండూరుకు మంత్రుల రాక

- సబ్‌స్టేషన్లు, ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులకు శంకుస్థాపనలు



యాలాల మండలం దౌలాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం ఎంపిక చేసిన స్థలం

తాండూరు: తాండూరు నియోజకవర్గంలో ఈ నెల 29న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటించనున్నారు. తొలుత యాలాల మండలంలోని జుంటిపల్లి శ్రీ రామచంద్రస్వామిని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి దర్శించుకుంటారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో తాండూరు నియోజకవర్గానికి మంజూరైన ఆరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పనులకు శంకుస్థాపన చేస్తారు. ఇందుకోసం రూ.19.23 కోట్లు మంజూరైనట్లు తెలిసింది. అనంతరం దౌలాపూర్ గ్రామ శివారులో రూ.250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం తాండూరు పట్టణంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. ఇందుకోసం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

ఆరు సబ్ స్టేషన్ల మంజూరు

తాండూరు నియోజకవర్గంలోని ఆరు గ్రామాలకు 33/11 కేవీ సబ్ స్టేషన్లు మంజూరయ్యాయి. మే 16న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజీపూర్, పాషాపూర్, కొండాపూర్, తాండూరు, నారాయణపూర్, బెల్కటూర్ గ్రామాల్లో సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఈ క్రమంలో ఆరు సబ్ స్టేషన్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటికే ఆయా గ్రామాల్లో భూమిని సైతం సేకరించారు. హాజీపూర్‌లో 1.3 ఎకరాలు, పాషాపూర్‌లో 1.25 ఎకరాలు, కొండాపూర్‌లో రెండు ఎకరాలు, చెన్‌గేష్‌పూర్‌లో రెండు ఎకరాలు, నారాయణపూర్‌లో 1.5 ఎకరాలు, బెల్కటూర్‌లో 1.2 ఎకరాల సేకరించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో త్రివిక్రమ్‌కు గోల్డ్ మెడల్

దుద్యాల్: అండర్ - 14 జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో దుద్యాల్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన తూర్పు త్రివిక్రమ్ యాదవ్ బంగారు పతకం సాధించారు. కేంద్రీయ విద్యాలయ సంగతమ్ ఆధ్వర్యంలో పంజాబ్ రాజధాని చండీగఢ్‌లో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు 54వ జాతీయ స్పోర్ట్స్ మీట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం తరఫున పోటీ చేసి గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



గోల్డ్ మెడల్ సాధించిన త్రివిక్రమ్ యాదవ్ (వృత్తంలో)

శ్రావణం.. శుభప్రదం

- మహిళలకు ప్రీతిపాత్రం
- ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి



కొడంగల్‌లోని శ్రీ మహాదేవుని ఆలయం

కొడంగల్ రూరల్: శ్రావణ మాసం శుభకరమైన మాసం. ఈ మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, సకల శుభ కార్యాలయాలకు శుభప్రదంగా భావించేది శ్రావణ మాసమని వేద పండితులు పేర్కొంటున్నారు. ఈ మాసంలో వచ్చే సోమ, మంగళ, శుక్ర, శనివారాలు ఎంతో ప్రాముఖ్యత కలిగినవని అంటున్నారు. వివాహాలు, గృహ ప్రవేశాలు, వాహనాల కొనుగోళ్లు, శుభకార్యాలు శ్రావణమాసంలో జరుపుకొనేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. ఈ నెలలోనే పౌర్ణమి రోజు చంద్రుడు శ్రావణ నక్షత్రంలోకి సంచరించడం వల్ల శ్రావణమాసం అనే పేరు వచ్చిందని పురాణ హితోక్తి అని చెబుతున్నారు. ఈ నెల రోజుల్లో దైవ కార్యాలకు ఎంతో శక్తి ఉంటుందని, భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మికతతో ప్రత్యేక పూజలు చేసుకునేందుకు ఇష్టపడతారు.

నోములు, వరలక్ష్మి వ్రతాలు

శ్రావణమాసం అంటే మహిళలకు ఎంతో ఇష్టం. ఇంటిల్లిపాది సుఖ సంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో విరాజిల్లాలని ప్రత్యేక పూజలు చేస్తారు. ఇల్లే దేవాలయంగా భావిస్తూ అమ్మవారిని ప్రతిష్ఠించి మంగళగౌరి నోములు, వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తారు. ఇంటింటా ప్రత్యేక పూజలతో ఉపవాస దీక్షలు చేస్తారు. మంగళ, శుక్రవారాల్లో శ్రీ లక్ష్మీదేవికి ఆలయాల్లో, ఇళ్లల్లో విశేష పూజలు, వ్రతాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తారు. ప్రతి సోమవారం శ్రావణ వ్రతం ఆచరించడం ద్వారా శివుని అనుగ్రహం పొందుతారని విశ్వాసం. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, సుగంధ ద్రవ్యాలతో శివలింగానికి పంచామృతాభిషేకం, నమక, చమక అధ్యాలను పఠిస్తూ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఈ మాసంలో దానం చేయడంతో విశేష ఫలితం లభిస్తుందని పురాణ హితోక్తి.

పండుగలు, ఉత్సవాలు

ఈ నెల 29న నాగపంచమి, ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతం, 9వ రాఖీ పూర్ణిమి, 16న శ్రీకృష్ణాష్టమి, 23న పొలాల అమావాస్య వంటి ముఖ్యమైన పండుగలు ఉన్నాయి. ఆగస్టు 22న ఐదో శుక్రవారంతో శ్రావణమాసం ముగుస్తుంది. ఈ మాసం పూర్తయిన వెంటనే బాద్రపదమాసం ప్రారంభమవుతుంది. ఈ నెల ఆరంభంలో వినాయక చవితి పండుగ వస్తుంది.

శ్రావణమాసంలో..

జూలై మాసంలో 26, 30, 31, ఆగస్టు 01, 03, 04, 06, 10, 13, 15, 17తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు తెలిపారు. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, శుభకార్యాలకు మంచి రోజులు వచ్చాయని చెబుతున్నారు. పురోహితుల నుంచి ఫొటో గ్రాఫర్లు, బాజాభజంత్రీలు, ఈవెంట్ల నిర్వాహకులు, వస్త్ర దుకాణాలు, పూలు, పండ్లు, ప్రింటింగ్ ప్రెస్‌లకు డిమాండ్ పెరగనుంది.

విష్ణు పూజలకు ప్రసిద్ధి

చాంద్రమానం ప్రకారం శ్రావణాన్ని ఐదో నెలగా పరిగణిస్తూ శ్రవణ నక్షత్రం మహావిష్ణువు జన్మ నక్షత్రం కావడంతో విష్ణు పూజలకు ప్రసిద్ధి. కొడంగల్‌లో పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శ్రావణమాసంలోని మూడో శనివారం రోజున లక్ష మంది గోత్ర నామాలతో 30 మంది బ్రాహ్మణోత్తములచే స్వామివారికి లక్ష తులసీ అర్చన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. పట్టణంలోని శ్రీ జగద్గురు నిరంజన మఠంలో నిత్యం స్వామి వారికి రుద్రాభిషేకం చేస్తారు. ఆలయాల్లో భజన కార్యక్రమాలు ఉంటాయి.

అన్నీ మంచి రోజులే



శ్రావణమాసంలో అన్నీ మంచి రోజులే. ఈ నెలను పండుగల మాసమని, వ్రతాల మాసమని చెప్పవచ్చు. శివునికి ప్రీతిపాత్రమైన మాసం కావడంతో ఏకబిల్వం శివార్పణం అంటూ పూజలు నిర్వహించడంతో శివుని అనుగ్రహం లభిస్తుంది. మహిళలు, యువతులు మంగళగౌరీ వ్రతాలు, నోములు జరుపుకొంటారు.

– విజయకృష్ణ జ్యోషి, పురోహితులు, కొడంగల్

క్లుప్తంగా

వికారాబాద్ వాసికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న భీమేష్ పూసల

అనంతగిరి: వికారాబాద్‌కు చెందిన భీమేష్ పూసల అనాటమీ విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొంది, గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆయన హైదరాబాద్‌లోని అపోలో కాలేజీ, ఏసిక్ వైద్య కళాశాలలో అనాటమీ అధ్యాపకుడిగా పనిచేశారు. చెన్నైలోని ప్రతిష్టాత్మక భారత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి డాక్టరేట్ తీసుకున్నారు.

కల్లు తయారీలో మత్తు పదార్థాలు కలిపితే చర్యలు

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్



తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

అనంతగిరి: నిషేధిత మత్తు పదార్థాలు కలిపి కల్లు తయారీ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్ హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణంలోని ఎన్నెపల్లిలో టీఎఫ్‌టీ కౌంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కల్లు పరీక్షించి సీహెచ్ లేదని నిర్ధారించారు. సేకరించిన సాంపిల్‌ను నారాయణగూడ ప్రభుత్వ ప్రయోగశాలకు పంపిస్తామన్నారు. కల్లు సీసాలను పరిశుభ్రంగా కడగాలని, కల్లు తయారీలో స్వచ్ఛమైన తాగునీటినే ఉపయోగించాలని సూచించారు. ఆయన వెంట వికారాబాద్ సీఐ రాగవీణ, ఎస్ఐలు శ్రీనివాస్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కమీషన్ ఇవ్వండి

మహేశ్వరం: రేషన్ డీలర్లకు రావాల్సిన ఐదు నెలల ఉచిత బియ్యం పంపిణీ కమీషన్ విడుదల చేయాలని రేషన్ డీలర్ల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సివిల్ సప్లై కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు నెలల్లో అందించిన ఉచిత రేషన్ బియ్యానికి కమీషన్ విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం తిరిగి తీసుకోవాలన్నారు. రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్లు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భానుచందర్, పలువురు డీలర్లు పాల్గొన్నారు.



అనంతగిరుల్లో జలపాతాలు

అనంత గిరులు.. జనం బారులు

వరుస వర్షాలు కురుస్తుండడంతో అనంతగిరి అందాలు వీక్షించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఘాట్‌రోడ్డులో ఉన్న లోయల్లో సంచరిస్తూ.. గుట్టల నుంచి జాలువారుతున్న జలకళను కెమెరాల్లో బంధిస్తూ ఉల్లాసంగా గడుపుతున్నారు. – అనంతగిరి



యువకుల కోలాహలం

పుస్తకావిష్కరణ

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సామ రవీందర్ రెడ్డి రాసిన ఇండియన్ ఎకనామిక్స్ పుస్తకాన్ని శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన వారికి జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి రాసిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ పుస్తకం సివిల్స్, గ్రూప్స్, పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారికి ఎంతో ఉపయోగపడుతుందని రవీందర్‌రెడ్డి తెలిపారు. పుస్తకాన్ని సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

- అటవీ శాఖ అధికారులు కంది చేను ధ్వంసం చేశారని మనస్తాపం
- ధారూరు పీఎస్‌లో బాధితుడి భార్య ఫిర్యాదు

ధారూరు: తాను సాగుచేసిన కంది పంటను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేశారని మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్యా యత్నం చేసిన ఘటన వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని దోర్నాల్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామ సమీపంలోని సర్వేనంబర్ 76/ఆలో ఎకరం భూమిలో తానెం సత్యయ్య కంది పంట వేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్ట్ సిబ్బంది చేనును ధ్వంసం చేస్తుండగా సత్తయ్యతో పాటు అతని భార్య అడ్డుకుని, బతిమాలారు పంటను పాడు చేయడంతో మనస్తాపానికి గురైన సత్తయ్య పురుగు మందు తాగగా, వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజర్ రాజేందర్‌ను అడగగా ఎనిమిదేళ్ల క్రితమే సదరు భూమిని సర్వే చేయించి అటవీ శాఖదిగా గుర్తించామని, చుట్టూ కందకం తీయించి, బయో డీజిల్ మొక్కలు నాటించామని తెలిపారు. ఇందులో కంది సాగు చేయగా, తమ సిబ్బంది గమనించి పంటను తొలగించారని ఆయన పేర్కొన్నారు. రైతు సత్యయ్య వద్ద భూమికి సంబంధించిన పత్రాలేవైనా ఉంటే సర్వే చేయించుకోవాలని ఒకవేళ వారిదని తేలితే వదిలేస్తామని చెప్పారు. తమకు సమాచారం ఇవ్వకుండా తప్పుడు సర్వే చేయించి భూమిని లాక్కుకున్నారని సత్తయ్య భార్య స్వరూప ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు సత్తయ్య

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

కొత్తూరు: మండల పరిధిలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. శనివారం సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం మండలం సుభాష్‌పూర్ గ్రామానికి చెందిన వర్కుల సాయిరాం(21) బొల్లు వెంకటేశ్ శుక్రవారం అర్ధరాత్రి కారులో మాణిక్యమ్మ గూడ నుంచి పెంజర్ల మీదుగా స్వగ్రామానికి వెళ్తున్నారు.ఈ క్రమంలో గ్రామశివారులోని మూలమలుపు వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన సాయిరాం అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి సుమతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగిఉన్న డీసీఎంను ఢీకొట్టిన బైక్

రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన ఓ డీసీఎంను శంషాబాద్ మండలం పెద్దతూప్ర గ్రామానికి చెందిన చిటికెల పవన్(24) తన బైకుతో ఢీకొట్టాడు. శుక్రవారం రాత్రి పవన్ షాద్‌నగర్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. కొత్తూరు పట్టణం పెంజర్ల కూడలి సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు పక్కన నిలిపిన డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన పవన్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి వద్ద లభ్యమైన ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై మృతుడి అన్న రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

కురుస్తున్న పశువైద్యాలయం.. జంకుతున్న సిబ్బంది

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మర్పల్లి పశువైద్యాలయంలోకి నీరు చేరుతోంది. పురాతన భవనం కావడంతో పైకప్పు కురిసి కార్యాలయంలోని ఫైళ్లు, రిజిస్టర్లు, ఇతర సామగ్రి పాడువుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధులకు సైతం ఆటంకం కలుగుతోందని వాపోతున్నారు. పాలకులు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు. – మర్పల్లి



కూలిన ఇంటి పైకప్పు

తప్పిన పెను ముప్పు

దోమ: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం అర్ధరాత్రి ఓ ఇల్లు కూలింది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రసూల్ కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తుండగా ఒక్కసారిగా పైకప్పు కూలింది. వారు పడుకున్న చోట కాకుండా మరోచోట కూలడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారులు పరిశీలించి నూతన ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ నర్సింలు శనివారం కూలిన ఇంటిని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



కూలిన ఇంటిలో రసూల్ కుటుంబీకులు

610 జీఓ అమలు చేయాలి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

బంట్వారం: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న స్కావెంజర్లకు చెల్లించాల్సిన పారితోషకం వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం అన్నారు. శనివారం ఆయన బంట్వారం మండలంలోని పలు పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది నుంచి స్కావెంజర్లకు వేతనాలు అందడం లేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి డబ్బులు విడుదల చేయాలన్నారు. 317 జీఓతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే 610 జీఓను అమలు చేయాలన్నారు. మోడల్ స్కూళ్ల, కేజీబీవీ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు, పదోన్నతలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వెంకటేషం, ప్రకాశ్, రవీందర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



రొంపల్లిలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న వెంకటరత్నం

ఇష్టారాజ్యంగా లారీల పార్కింగ్

నవాబుపేట: మైనింగ్ లారీలకు మండల కేంద్రం అడ్డాగా మారింది. వీటిని ప్రధాన రోడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. దీంతో బాటసారులు, ఇతర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలోని వట్టిమీనపల్లి, మీనపల్లికలాన్, మాదిరెడ్డిపల్లి, ఆర్కతల, యావాపూర్ గ్రామాల్లో కొంతకాలంగా ఎర్రమట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇందుకోసం వాడే భారీ వాహనాలను నవాబుపేటలోని మెయిన్ రోడ్ల పక్కన ఆపుతున్నారు. ముఖ్యంగా వైన్స్ సమీపంలో నిలుపుతున్న లారీలు గంటలు, రోజుల తరబడి ఒకే చోట ఉంటున్నాయి. పని నడవని రోజు కొంత మంది కార్మికులు, డ్రైవర్లు, క్లీనర్లు లారీల్లోనే మద్యం తాగుతూ గడుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మండల కేంద్రంలోని వైన్స్ ఎదుట నిలిపిన మైనింగ్ లారీలు

రైతులకు సరిపడా యూరియా

ఏడీఏ శోభారాణి

ఆమనగల్లు: రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని ఆందోళన చెందవద్దని ఆమనగల్లు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీఏ శోభారాణి చెప్పారు. శనివారం ఆమె డివిజన్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలలో సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లోని యూరియా నిల్వ లను పరిశీలించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ.. అన్ని సింగిల్‌విండో కార్యాలయాల ద్వారా అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా, డీలర్ల ద్వారా రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. రైతులకు అవసరమైన ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అందిస్తున్నామని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేస్తుందని ఆమె చెప్పారు. రైతులు యూరియా పంపిణీ విషయంలో ఆందోళన చెందకుండా అవసరమైన ఎరువులను తీసుకుపోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శ్రీనివాస్‌గౌడ్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చె.. నీరు నిలిచె

మండల కేంద్రంలోని భూలక్ష్మి చౌరస్తాలో చిన్నపాటి వర్షానికే నీరు నిలుస్తోంది. ధ్వంసమైన ఈ ప్రధాన కూడలిలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోడంతో చిన్నపాటి కుంటను తలపిస్తోంది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – బొంరాస్‌పేట



వేటకు వేళాయె..

విస్తారంగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. కాకరవేణి నదిపై శివసాగర్ ప్రాజెక్ట్ అలుగు పారతుండడంతో స్థానికులు చేపల వేటలో మునిగిపోయారు. గాలంతో చేపలు పడుతూ కాలక్షేపం చేస్తున్నారు. – యాలాల



గాలానికి చిక్కిన కొర్రమీను



శివసాగర్ సమీపంలో లభించిన భారీ చేపను చూపుతున్న వ్యక్తి

అప్పు చెల్లించినా.. చంపుతామని బెదిరిస్తున్నారు

మోకిల పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు

శంకర్‌పల్లి: తీసుకున్న అప్పు వడ్డీతో సహా చెల్లించినప్పటికీ తన భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోగా చంపుతామంటూ బెదిరిస్తున్నారని ఓ వ్యక్తి శనివారం మోకిల పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోకిలకు చెందిన ఫరీద్ కుటుంబ అవసరాల నిమిత్తం 2021లో తన భూమిని హైదరాబాద్‌కి చెందిన సునీల్ కుమార్ అహుజా, అశీష్‌అహుజాలకు రిజిస్ట్రేషన్(తాకట్టు) చేసి, రూ.17 కోట్లు అప్పుగా తీసుకున్నాడు. 2022 డిసెంబర్‌లో వడ్డీతో కలిసి రూ.22 కోట్లు చెల్లించాడు. అనంతరం భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా కాలయాపన చేస్తూ వచ్చారు. మొదటి నుంచి ఈరోజు వరకూ ఫరీద్ కబ్జాలో ఉన్నాడు. శుక్రవారం సునీల్, అశీష్ భూమి వద్దకు చేరుకుని అతనితో గొడవ పడ్డారు. ఫొటోలు, వీడియోలు తీస్తూ చంపేస్తామని బెదిరించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వీరబాబు తెలిపారు.

గొర్రెల మందపై వీధికుక్కల దాడి

- పది జీవాలు మృతి
- మరో 40 గొర్రెలకు గాయాలు

నందిగామ: ఇటీవల రంగాపూర్‌లో నాటుకోళ్ల ఫామ్ ఘటన మరువకముందే శనివారం మండల కేంద్రంలో తాజాగా గొర్రెల మందపై వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికిచెందినబాలయ్య గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే మంద వద్ద నిద్రించిన బాలయ్య ఉదయం ఇంటికి వెళ్లి వచ్చే వరకు సుమారు 15 వీధికుక్కలు మందపై దాడి చేశాయి. ఈ ఘటనలో పది గొర్రెలు మృత్యువాత పడగా మరో 40 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న పశువైద్య సిబ్బంది లింగమయ్య ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన జీవాలకు చికిత్స అందించారు. సుమారు రూ. లక్ష వరకు నష్టపోయానని బాధితుడు బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



గొర్రెల కళేబరాలు

షాద్‌నగర్ బీజేపీలో విభేదాలు లేవు

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ నాయకుల మధ్యన ఎలాంటి విభేదాలు లేవని, అవసరం వచ్చినప్పుడు అందరూ పార్టీకోసం పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా పర్యటనకు వెళ్తు న్న ఆయనకు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ వద్ద ఘన స్వాగతం పలికారు. శాలు వాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి పార్టీ బలోపేతంతోపాటు నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాల న్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, నాయకులు అందె బాబాయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసులు సత్వరం పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్

షాద్‌నగర్: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు తగిన విధంగా కృషి చేయాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కరుణ కుమార్ అన్నారు. షాద్‌నగర్ కోర్టును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. న్యాయవాదులు, న్యాయమూర్తులకు మధ్య మంచి సంబంధాలు ఉండాలని, అప్పుడే కేసుల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. ప్రతి చిన్న విషయానికి గొడవలు పడి పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. రాజీ మార్గాలను అన్వేషించి వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి రవికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్వవేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.



జిల్లా జడ్జి కరుణకుమార్‌ను సన్మానిస్తున్న ఆమనగల్లు జడ్జి స్వరూప

కోర్టు భవనానికి మూడెకరాలు..

ఆమనగల్లు: ప్రస్తుతం కోర్టు కార్యకలాపాలు నిర్వహిస్తున్న భవనం అన్నింటికి అనుకూలంగా ఉందని ఇక్కడే మూడెకరాలు కేటాయించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్ తహసీల్దార్ లలితకు సూచించారు. శనివారం ఆయన ఆమనగల్లులో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సందర్శించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప, ఆమనగల్లు బార్ అసోసియేన్ అధ్యక్షుడు యాదీలాల్, సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కరుణకుమార్‌ను గజమాలతో సత్కరించారు. అనంతరం కోర్టు పరిసరాలను, భవనాలను పరిశీలించారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కోర్టుకు ఐదెకరాల స్థలం కేటాయింపు, నూతన భవనం నిర్మాణం, సబ్ కోర్టు ఏర్పాటు తదితర విషయాలను జిల్లా జడ్జికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్ వివరించారు. స్థలం కేటాయింపు అనంతరం భవనాల నిర్మాణానికి హైకోర్టుకు సిఫారసు చేస్తామని కరుణకుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐలు గంగాధర్, వేణుగోపాల్, జానకీరాంరెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, శేఖర్, చంద్రశేఖర్, ఏపీపీ కార్తీక్, బార్ అసోసియేషన్‌సభ్యులు జగన్, ఆంజనేయులుయాదవ్, రామకృష్ణ, మధు, మల్లేశ్, శేఖర్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సంతోశ్, దేవేందర్, గణేశ్, మురళీకృష్ణ, శ్రీశైలం, మహేశ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

దుద్యాల్: తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ యూఎస్‌పీసీ ఉపాధ్యాయ సంఘాల సభ్యులు శనివారం తహసీల్దార్ కిషన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి తమ సమస్యలు పరిష్కారం నోచుకోవడం లేదని.. ప్రభుత్వం స్పందించి జీఓ నంబర్ 25ను సవరించాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె కాలపు జీతాలు చెల్లించాలని, గురుకుల పాఠశాలల టైం టేబుల్‌ను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా మార్చాలని డిమాండ్ చేశారు. అన్ని కేడర్లుకు సంబంధించి ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్‌లు వెంటనే చేపట్టాలని, పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయుల బెనిఫిట్స్‌ను వెంటనే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మల్లప్ప, జిల్లా కార్యదర్శి మల్లేశ్, ఎస్‌పీసీ, యూఎస్‌పీసీ నాయకులు సుధాకర్ రావు, రవి, ముకుంద రెడ్డి, సంపత్ కుమార్, అభయ్ కుమార్, స్వాతి, చందర్, రవీందర్ గౌడ్, వెంకటయ్య, పారిజాత తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు